క్లుప్తంగా

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్ గ్రామంలో దాత కిశోర్‌కుమార్ ఆర్థికసాయంతో 10 విద్యుత్ స్తంభాలు, లైట్లను ఏర్పాటు చేశారు. రూ.82వేలతో స్తంభాలు, లైట్లను బుధవారం సీనియర్ కాంగ్రెస్ నాయకులు డా.పగిడాల శ్రీనివాసులు ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ సాయిప్రసాద్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ కృష్ణ, పుల్లారావు., ఎమ్మార్పీఎస్ నాయకులు గంధం లక్ష్మయ్య, మత్స్యకార సహకార సంఘం నాయకులు మిద్దె రమేష్, శ్రీనుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చెస్‌బోర్డుల పంపిణీ

కొత్తకోట: ఎన్నారై ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవిప్రకాష్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెస్ బోర్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ కృష్ణయ్య నేతృత్వంలో మండల రిసోర్స్ కేంద్రంలో పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎంలు శ్రీనివాస్‌రెడ్డి, నిర్మలాదేవి, జి.సురేష్, స్వర్ణోజ భాస్కర్, తపస్ సంఘం జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



గోపాల్‌పేట: మండల కేంద్రంలో బుధవారం పోచమ్మ బోనాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో పోచమ్మ ఆలయానికి వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు, యువతులు, యువకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పూజలు

అమరచింత: పట్టణంలోని బీసీ కాలనీలో వెలిసిన లక్ష్మీనర్సింహా స్వామి ఆలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన పూజలు బుధవారం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కొనసాగుతున్నాయి. మొదటిరోజు గణపతిపూజ, బొడ్రాయి పూజలు కొనసాగాయి. గురువారం కూడా ధ్వజస్తంభ పూజలు కొనసాగుతున్నట్లు వెల్లడించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు తిరుమలప్రకాష్, రాజు, ప్రసాద్, రవి, కృష్ణ, వెంకటేష్, రఘు, ఎల్లస్వామి పాల్గొన్నారు.

‘ఉపాధి’ సామాజిక తనిఖీ

వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన రూ.6కోట్ల42లక్షల పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసారావు, ఏపీఓ శేఖర్‌గౌడ్ తెలిపారు. సీసీరోడ్లు, కాల్వల పూడికతీత పనులు, హరితాహారం, భూమి అభివృద్ధి పనులకు కూలీలకు చెల్లించిన రూ.4కోట్ల 41 లక్షలతో పాటు మరో రూ.2 కోట్లు సంబంధించిన 15వ విడత సామాజిక తనిఖీని బుధవారం ప్రారంభించామన్నారు. గ్రామల్లోని రైతులు, కూలీలు సిబ్బందికి సహకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి

ఖిల్లాఘనపురం: మండలంలోని షాపురం గ్రామంలో బుధవారం కృష్ణాష్టమి వేడుకలను త్రైతసిద్ధాంత ప్రభోద సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మూడురోజులపాటు అంజనేయులు ఇంటివద్ద ఏర్పాటు చేసిన వేదికలో శ్రీకృష్ణుడి ప్రతిమతో పూజలు నిర్వహించారు. బుధవారం గ్రామంలో స్వామి వారి ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, రాఘవేంద్రాచారి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

కొత్తకోట రూరల్: సంప్రదాయ సాహిత్యంలో విశేషమైన ప్రతిభ కనపరిచినందుకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి గోల్డ్‌మెడల్ సాధించిన మిరాసిపల్లి పాఠశాలలో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రమేష్‌కు గోల్డ్‌మెడల్ వరించింది. బుధవారం పాఠశాలలో హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు సత్యనారాయణతో పాటు ఉపాధ్యాయబృందం పూలమాలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి

గోపాల్‌పేట: ఇళ్లు కూలిపోయిన పేదలకు వెంటనే తగిన సౌకర్యాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ డిమాండ్ చేశారు. ఏదుల మండలంలోని చీర్కపల్లి గ్రామంలో అకాల వర్షాలకు కూలిన రెండు ఇండ్లను ఆయన పరిశీలించి వారితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్ ఉన్నాడు.

అప్రమత్తంగా ఉండాలి

వనపర్తిటౌన్: సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో డెంగీ, మలేరియా, జ్వరాలు అధికంగా సోకుతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని ఆయా వార్డులలో తడి, పొడి వ్యర్థాల విభజన, సీజనల్ వ్యాధులపై తగు సూచనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.

కోతులు, కుక్కలతో బెంబేలు



గోపాల్‌పేట పోలీస్‌స్టేషన్ వద్ద గుంపులుగా ఉన్న కుక్కలు (ఫైల్)

- చిన్నారులపై దాడి.. ఆస్పత్రిపాలు
- విద్యార్థులకు రోజూ తప్పని అవస్థ
- బయటికొచ్చేందుకు జంకుతున్న జనం
- పట్టించుకోని అధికారులు



బస్టాండ్ సమీపంలో మహిళను చుట్టుముట్టేందుకు ప్రయత్నిస్తున్న కోతులు

వేగలేకపోతున్నం



గోపాల్‌పేటలో కోతులు, కుక్కల బెడద తీవ్రమైంది. సుమారు సంవత్సరం క్రితం మా అబ్బాయికి కుక్క కాటువేసింది. చాలా ఇబ్బంది పడ్డాం అప్పటినుంచి మా బాబు ఎక్కడికైనా ఒంటరిగా పంపించాలంటే భయమేస్తుంది. గోపాల్‌పేటలో కుక్కలబెడద తీవ్రంగా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి శునకాలు, కోతులను ఎక్కడికైనా తరలించాలి.

–మహేష్, రాంనగర్ కాలనీ, గోపాల్‌పేట

చర్యలు తీసుకుంటాం

కోతులు, కుక్కలు ఎక్కువైన మాట వాస్తవమే. కుక్కల గురించి ఏబీసీ సెంటర్ (యాంటీబర్త్ కంట్రోల్) వారికి సమాచారం ఇస్తే తీసుకెళ్తారు. వివరాలు తెలుసుకుని కుక్కలు, కోతుల బెడద లేకుండా చర్యలు తీసుకుంటాం.

– భవాని, ఎంపీడీఓ, గోపాల్‌పేట

గోపాల్‌పేట: ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో కోతులు, కుక్కల బెడదతో ప్రజలు విసిగెత్తిపోతున్నారు. కొన్నేళ్లుగా ఈ సమస్య ఉన్నా ప్రజాప్రతినిధులు, అధికారులకు పట్టడం లేదు. దీంతో ఈ సమస్య పరిష్కారం కాని సమస్యగా మారిపోయింది. మహిళలు, చిన్నపిల్లలు ఒంటరిగా బయటకు వెళ్లాలంటే రోడ్లపై కుక్కలు, కోతులు ఎక్కడెక్కడ ఉన్నాయి. అవి ఏమైనా దాడి చేస్తాయా అని ఆలోచించుకుని తల్లిదండ్రులు పిల్లలను బయటికి పంపిస్తున్నారంటే కోతులు, కుక్కల వల్ల ఎంత ఇబ్బంది అవుతుందో ఆలోచించుకోవచ్చు. కోతులట, కుక్కలను తరలించేందుకు అధికారులు సైతం ఏం చేయాలో తోచని పరిస్థితిలో ఉన్నారు.

ఇదీ పరిస్థితి..

గోపాల్‌పేట, రేవల్లి, ఏదుల మండలాల్లో కోతులు కుక్కలు ఎక్కువయ్యాయి. గోపాల్‌పేటలో పోలీస్‌స్టేషన్ నుంచి బస్టాండ్ వరకు 24 గంటలు యాభైకి పైగా కుక్కలు ఉంటున్నాయి. పోలీస్‌స్టేషన్ వద్ద 50కోతులు ఉన్నాయి. ప్రతి గ్రామంలో 200 వరకు కుక్కలు ఉన్నాయి. అలాగే కోతులు సైతం వందల్లోనే ఉన్నాయి. రోడ్డుపై వచ్చీపోయే వాహనాలు, మనుషులపై దాడులు చేస్తున్నాయి. గోపాల్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థులపై ప్రతిరోజూ కోతులు దాడి చేస్తున్నాయి. మహిళలపై కోతులు దాడి చేస్తుండటంతో భయాందోళనకు గురై పరుగులు పెడుతున్నారు. ఇలా దాడులు చేసిన ప్రతిసారి జనాలు సమస్యను ఎవరికి చెప్పాలో తెలియక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డువెంట చికెన్‌షాపుల వద్ద వ్యర్థాలను కుక్కలకు వేయడంతో దాడులకు పాల్పడుతున్నాయి. వెంటనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని వీటి బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

⇨ రేవల్లి మండలకేంద్రంలో సుమారు రెండేళ్ల క్రితం ఓ యువకుడిని కుక్కకాటు వేసింది. తర్వాత ఆ యువకుడికి రేబిస్ వ్యాధి సోకి మృతిచెందాడు. అలాగే గోపాల్‌పేటలో పాఠశాలకు వెళ్తున్న బాలుడిని కుక్కకాటు వేసింది. అప్పటినుంచి ఆ పిల్లాడు ఒంటరిగా బయటకు వెళ్లేందుకు భయపడుతున్నాడు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం



బీజేపీలో చేరిన వివిధ పార్టీల నాయకులు

ఖిల్లాఘనపురం: రాష్ట్రంలో మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కథ ముగిసిందని, వచ్చేది బీజేపీ ప్రభుత్వమని రాష్ట్ర కోశాధికారి బండారి శాంతకుమార్, జిల్లా అధ్యక్షుడు నారాయణగౌడ్ అన్నారు. బుధవారం మండలంలో ప్రజలు ఎన్నోఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంకోసం బుధవారం మండల శాఖ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. హాజరైన వారు జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయ్యగారి ప్రభాకర్‌రెడ్డిలతో నిరసనలో పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై నిరసన..

మండల ప్రజలు ఎన్నో ఏళ్ళుగా ఎదుర్కొంటున్న సమస్యలపై బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు, బీసీ ప్లాట్ల పంపిణీ, కర్నెతండాలో నిరుపయోగంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి సామగ్రిని ఏర్పాటు చేసి ఉపయోగంలోకి తీసుకురావడం తదితర సమస్యలపై బస్టాండ్‌లో నిరసన చేపట్టారు. అనంతరం గ్రామం నుంచి తహసీల్దార్ సుగుణకు వినతిపత్రం ఇచ్చారు.

బీజేపీ పార్టీలో చేరిక..

మండలంలోని వెంకటాంపల్లి గ్రామానికి చెందిన చెన్నయ్య ఆధ్వర్యంలో సుమారు 100 మంది గ్రామస్తులు వివిధ పార్టీల నుంచి బీజేపీలో చేరారు. వారికి శాంతకుమార్ తో పాటుగా జిల్లా అధ్యక్షుడు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్, విక్రం, రవినాయక్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఇస్రోలో వనపర్తి పేరు నిలబెట్టాలి



సుధీర్ కుమార్‌ను సన్మానిస్తున్న నిరంజన్‌రెడ్డి

వనపర్తిటౌన్: గత పదేళ్లుగా సాధించిన ఆర్థిక సుస్థిర అభివృద్ధితోనే ఈ ప్రాంత విద్యార్థులు అన్ని రంగాల్లో విజయావకాశాలను అందిపుచ్చుకుంటున్నారని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఇస్రో నిర్వహించిన పోటీ పరీక్షల్లో మాజీ కౌన్సిలర్ నాగన్న యాదవ్ కుమారుడు సుధీర్‌కుమార్ జాతీయ స్థాయిలో 51వ ర్యాంక్‌తో ఎంపిక కావడంతో బుధవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో నిరంజన్‌రెడ్డి సుధీర్‌కుమార్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. కృషి, పట్టుదలతో ప్రయత్నిస్తే ఎంచుకున్న రంగంలో విజయం తప్పక వరిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీచైర్మన్‌లు రమేష్‌గౌడ్, గట్టుయాదవ్, తిరుమల్, కంచెరవి పాల్గొన్నారు.

ముందు చూపుతోనే చెక్‌డ్యాంల నిర్మాణం

ఖిల్లాఘనపురం: మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ముందు చూపుతోనే పెద్దవాగుపై చెక్‌డ్యాంలు నిర్మించారని మండల మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, మాజీ జెడ్పీటీసీ సామ్యానాయక్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రాళ్ళకృష్ణయ్య అన్నారు. బుధవారం మండలంలోని వెంకటాంపల్లి గ్రామ శివారులో నిర్మించిన చెక్‌డ్యాంను పరిశీలించారు. పారుతున్న గంగమ్మకు పూలు చల్లి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో వర్షాలు సక్రమంగా కురవకపోయిన రైతులకు నష్టం వాటిల్ల కూడదనే ఆలోచనతోనే మండలంలోని పలు గ్రామాల్లో చెక్‌డ్యాంలు నిర్మించామన్నారు. బీఆర్ఎస్ హయాంలో కర్నెతండా, సల్కెలాపురం, అప్పారెడ్డిపల్లి, వెంకటాంపల్లి తదితర గ్రామాల్లో 5 చెక్‌డ్యాంలు నిర్మించామన్నారు. నేడు ఆ చెక్‌డ్యాంల నుంచి పారుతుంటే రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు సురేందర్, అంజిరెడ్డి, లక్ష్మణ్, రాములు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కోతకు గురైన రోడ్డు మరమ్మతు చేపట్టాలి



రోడ్డును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

పాన్‌గల్: మండలంలోని రేమద్దుల గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టి రవాణా సౌకర్యం పునరుద్ధరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ జబ్బార్ అన్నారు. బుధవారం గ్రామంలో పెద్దకాల్వను ఆయన పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నల్లకుంట చెరువు అలుగు సమీపంలో బ్రిడ్జి నిర్మాణం పూర్తికాక , ఇటీవల వర్షాలకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డు కోతకు గురై రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బ్రిడ్జి నిర్మాణం జాప్యం చేయకుండా త్వరగా పూర్తి చేయాలన్నారు. దీంతో పాటు వెంగళాయిచెరువు వెనుక వైపు ఉన్న పెద్దకాల్వలో నీరు ఉధృతంగా రైతులు పొలాలకు వెళ్లడం ఇబ్బందిగా మారిందన్నారు. అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టి రైతుల ఇబ్బందులను తొలగించాలన్నారు. కార్యక్రమంలో గుంటి వెంకటయ్య, ఎం.వెంకటయ్య, భాస్కర్, నిరంజన్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మేకలు మృతి

పాన్‌గల్: విద్యుదాఘాతానికి రెండు మేకలు మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకున్నది. గ్రామస్తులు, బాధిత గొర్రెల కాపరి బీరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గొర్రెలు, మేకలను మేత కోసం గ్రామ శివారులో వ్యవసాయ పొలాలకు వెళ్లగా అక్కడ మేత మేస్తున్న క్రమంలో సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర వైరు తగిలి షాక్‌తో మేకలు పడినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి డా.సురేష్ పంచనామ నిర్వహించారు. మేకల విలువ దాదాపుగా రూ.40వేలు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

తండాల్లో మూతబడిన పాఠశాలలు తెరిపించాలి

పాన్‌గల్: గిరిజన తండాల్లో మూతపడిన పాఠశాలలను తెరిపించి గిరిజన విద్యార్థులకు మౌలిక సదుపాయాలను కల్పించాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాల్యానాయక్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని దావాజిపల్లితండా, అన్నారం తండాల్లో గిరిజన సంఘం బృందం పర్యటించారు. ప్రభుత్వం పేద విద్యార్థులు విద్యకు దూరం కాకుండా చూస్తామని చెబుతున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా ఉందన్నారు.

అలరించిన మేళా

అమరచింత: పట్టణంలోని డీఎంఆర్ఎం ప్రాథమిక పాఠశాలలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి ప్రభుత్వ పాఠశాలల బోధనాభ్యాస మేళా కార్యక్రమం పలువురిని అలరింపచేసింది. విద్యాశాఖ ఆధ్వర్యంలో తొలిమెట్టులో భాగంగా విద్యార్థులకు బోధనభ్యాసన సామగ్రిని మేళాను నిర్వహించామని ఎంఈఓ భాస్కర్‌సింగ్ తెలిపారు. కార్యక్రమాన్ని ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎస్ఐ స్వాతి ప్రారంభించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ స్వామితో పాటు హెచ్ఎంలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

వనపర్తి రూరల్: మెడికల్ షాపుల యజమానుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని మెడికల్ షాప్ అసోసియేషన్ జిల్లా నూతన అధ్యక్షుడు సురేష్‌కుమార్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మెడికల్ షాప్ అసోసియేషన్ కార్యాలయంలో లీగల్ అడ్వైజర్ బాలయ్య, చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్‌గా జైని శ్రీనివాసులు ఆధ్వర్యంలో మెడికల్ షాప్ అసోసియేషన్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. అధ్యక్షుడిగా సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, కోశాధికారి మణికుమార్ ను ఏకగీవంగా ఎనుకున్నట్లు ఆయన తెలిపారు.

అదనపు తరగతి గదులు మంజూరు చేయాలి

అమరచింత: మండల కేంద్రలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయని వెంటనే 4 గదులను మంజూరు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవ డిమాండ్ చేశారు. బాలికల ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అఫ్రోజ్, రమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణగురు సేవలు చిరస్మరణీయం

వనపర్తి టౌన్: ఒకే కులం ఒకే మతం ఒకే దేవుడంటూ ప్రబోధించిన నారాయణ గురు సేవలు మరువలేనివని మహానీయుల స్ఫూర్తివేదిక రాష్ట్ర చైర్మన్ రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో నారాయణగురు జయంతిని నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యాయవాది ఉత్తరయ్య, కవులు బూరోజుగిరిరాజాచారి, పాల్గొన్నారు.

వంతెన పనులు వెంటనే ప్రారంభిస్తాం

వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలంలోని జానంపేట నుంచి బునాదిపురం గ్రామాల మధ్య వాగుపై పిల్లర్ పనులు జరిగి అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి పనులను బుధవారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి పరిశీలించారు. ఈ రహదారి పనులు పూర్తయితే హైవేపై వెళ్లడానికి ప్రయాణికులకు దగ్గరవుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉన్నతాధికారులతో మాట్లాడి పనులను వెంటనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధానకార్యదర్శి యాదయ్య, రాజేంద్రప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ

ఆత్మకూర్: మండలంలోని మొట్లంపల్లి గ్రామంలో పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం వేదపండితుల ఆధ్వర్యంలో ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు శ్రీనివాసులు, వీరేశలింగం, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ కొటేష్, రవికుమార్‌యాదవ్, మండ్లరామకృష్ణ, గోవింది, భక్తులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు, నాయకులు

మార్వాడీలపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొత్తకోట రూరల్: గుజరాత్, రాజస్థాన్ నుంచి వలస వచ్చి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఆర్థిక సామ్రాజ్యం ఏర్పర్చుకున్న దోపిడీ దారులను వెళ్లగొట్టాలని మాదిగ ఓయూ జేఏసీ జిల్లా అధ్యక్షుడు జనంపల్లి కిరణ్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఇటీవల మార్వాడి పెత్తందారులు దళిత వ్యక్తిని హింసించి కొట్టడంపై మాదిగ ఓయూ జేఏసీ తీవ్రంగా ఖండిస్తూ బుధవారం పట్టణంలో అంబేడ్కర్ విగ్రహానికి, తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వివిధ సంఘాల నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కిరణ్ మాట్లాడుతూ.. మార్వాడీలు వ్యాపారాలు చేయడం ద్వారా మా ప్రాంతవారికి తీవ్ర అన్యాయం, నష్టం జరుగుతుందని మండిపడ్డారు. ఈ నెల 22న ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిరసనలు, ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వికాస్, మహేష్, ప్రసాద్, ప్రణీత్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ పల్లకీసేవ

ఖిల్లాఘనపురం: మండలంలోని హన్‌పాడ్‌లో బుధవారం పోచమ్మతల్లి పల్లకీసేవను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ సంఘం సభ్యులు ఉదయాన్నే అమ్మవారికి అభిషేకం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అమ్మవారి పల్లకీని గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి పూజలు నిర్వహించారు. గురువారం అమ్మవారి బోనాల పండుగను నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.



పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

బలహీనవర్గాల ఆశాజ్యోతి రాజీవ్‌గాంధీ

కొత్తకోట: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మాజీ పీఎం రాజీవ్‌గాంధీ జయంతిని బుధవారం కొత్తకోట చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ అధ్యక్షులు బీచుపల్లియాదవ్, పట్టణ అధ్యక్షుడు మేస్త్రి శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా పాల్గొని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, ఎస్‌జే.బోయేజ్, వేముల శ్రీనివాస్‌రెడ్డి, డా.పీజే.బాబు, కొండారెడ్డి, జేఎమ్.మిషేక్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ ఇంచార్జి సత్యశిలారెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు శివన్న, జిల్లా ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ వెంకటేష్, మండల ఉపాధ్యక్షుడు సుధాకర్‌రావు, వెంకటయ్య, జిల్లా యూత్‌కాంగ్రెస్ చైర్మన్ కొంకిరమేష్, మేస్త్రిబాలయ్య, కోదండం పాల్గొన్నారు.

మదనాపురం: మాజీ పీఎం రాజీవ్‌గాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



కొత్తకోటలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తి రూరల్: వనపర్తి, శ్రీ రంగాపురం, పెబ్బేరు మండలంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం రాజీవ్‌గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. పలువురు కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు విజయవర్ధన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్, సురేందర్‌గౌడ్, వెంకటేష్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: మాజీ పీఎం రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలను చిరస్మరణీయమని మార్కెట్ కమిటీ చైర్మన్ రహ్మతుల్లా అన్నారు. బుధవారం రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయలక్ష్మి, ఖాజన్న, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న

అమరచింత: ఏఐయూకేఎస్ రాష్ట్ర మహాసభలు ఈనెల 25, 26న పాలమూరులో నిర్వహిస్తున్నామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న తెలిపారు. బుధవారం మహాసభలకు వాల్‌పోస్టర్‌ను మస్తీపురం, కిష్టంపల్లి, నందిమళ్ళ, ఎక్స్‌రోడ్ గ్రామాల్లో రైతులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఎమెస్పీ ప్రకారం ధరలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్న వాటిని పట్టించుకోలేక పోవడం వింతగా ఉందన్నారు. రైతు ప్రయోజనాలను దెబ్బతీయడంతో పాటు వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేయడానికే కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నదన్నారు. స్వామినాథన్ కమీషన్ అందించిన నివేదిక ప్రకారం పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కురుమన్న, రాములు, శ్రీను, రంగన్న, శివారెడ్డి, దిలీప్, నరసింహా పాల్గొన్నారు.

బ్యాంక్ ఏర్పాటుకు పరిశీలన

వీపనగండ్ల: మండలంలోని కల్వరాల్ల గ్రామంలో నూతనంగా బ్యాంక్ ఏర్పాటు కోసం అవసరమయ్యే వసతులను జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ శివకుమార్ బుధవారం పరిశీలించారు. జటప్రోల్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు కల్వరాల్ల, తూముకుంట, చిన్నంబావి గ్రామాల్లో బ్యాంక్‌లు లేకపోవడంతో ఆయాగ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఎం సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బుధవారం బ్యాంక్ అధికారులు కల్వరాల్ల గ్రామంలోని రైతులు గ్రామస్థులతో బ్యాంకు ఏర్పాటుపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏడీఎం సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ఆత్మకూర్: ఆత్మకూర్ మండలంలోని పిన్నంచర్ల గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న బైకులను డీసీఎం వాహనం ఢీకొట్టడంతో నలుగురు తీవ్రంగా గాయపడిన సంఘటన చోటుచేసుకుంది.

ఎస్ఐ నరేందర్ తెలిసిన వివరాల ప్రకారం.. చిన్నచింతకుంట మండలం కురుమూర్తి గ్రామానికి చెందిన రామ్మోహన్, గొల్ల శివలు బైకుపై వస్తుండగా, అదే గ్రామానికి చెందిన వంశీ, మాసన్నలు పెట్రోల్ కోసం బైకును తోసుకుంటూ వస్తున్నారు. ఈ విషయం గమనించిన వారు తోసుకుంటూ వెళ్తున్న బైక్‌ను కూడా లాక్కెళ్తున్నారు. అంతలోపే ఎదురుగా వస్తున్న డీసీఎం ఢీ వారిని ఢీకొట్టింది. దీంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు ఆత్మకూర్ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి డీసీఎంను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.